
# రజ్జుసర్ప భ్రాంతి

Dr. మహీధర్ నళినీమోహన్



"అంతారెడీ అయిపోయింది. ఇంక నువ్వు లేవడమే తరవాయి" అంటూ సుడి గాలిలా తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు వలోద్య.

ఎటూ తెగని లెక్కలతో కుస్తీ పడుతున్న రమాకాంతం నెమ్మదిగా బరువుగా తల పైకెత్తేడు. ఆ కళ్లకు ఎదుటి వస్తువుల గుర్తింపు లేదు. ఆ మనస్సు చేస్తున్న లెక్కల నుంచి బయటపడలేదు.

"అల్లా చూస్తావేమిటోయ్! తెమల మంటూంటేనూ"

"ఎక్కడికీ ప్రయాణం?"

"అప్పుడే మరిచిపోయావా? జాగరద్ వెడదామన్నావు కదూ?"

"జాగరద్" అన్నమాట రమాకాంతాన్ని గణిత ప్రపంచంలోంచి లాక్కువచ్చి ఇవతల పడవేసింది. రష్యన్ భాషలో ఆ మాటకు ఊరి బయటకు వెళ్లడం అని అర్థం.

మాస్కో చుట్టుపక్కల దట్టమైన అడవులున్నాయి. వాతావరణం బాగుంటే శని ఆదివారపు శలవురోజుల్లో యూనివర్శిటీలో చదివే ఆడామగా జట్లుజట్లుగా బుజాల మీద పెద్దపెద్ద మూటలు వేసుకుని పట్టణం విడిచి వెళ్లిపోతూ ఉంటారు. ముప్పైనలభై మైళ్లు బస్సుల మీదవెళ్లి, ఏదో అడవిలో గుడారాలు వేసుకుని, చేపలు పట్టి, కుక్క గొడుగులు ఏరి, చితుకులతో చలిమంటలు వేసుకుని, ఆటలతో పాటలతో పట్టణ వాతావరణాన్ని మరిచి హాయిగా గడిపి వస్తూ ఉంటారు.

జాగరద్ అనే మాటకు అంత అర్థం ఉంది. రమాకాంతం మాస్కో వచ్చి ఏడాది కావస్తోంది. ఇంతవరకూ ఒక్కసారి కూడా **జాగరద్ వెళ్లే అవకాశం చిక్కలేదు.** బిగువైన స్పోర్ట్స దుస్తులలో ఉత్సాహం పెల్లుబికే రష్యన్ ఆడపిల్లలతో కలిసి జాగరద్ వెళ్లేవాళ్లను చూచి కించిత్తు అసూయ కూడా పడ్డాడు.

ఈ రోజున వలోద్య ఆహ్వానిస్తున్నాడు. అతడు రమాకాంతం పక్కగదిలో ఉంటున్నాడు. ఇద్దరూ ఒకే డిపార్టుమెంటులో రీసెర్చి చేస్తున్నారు. అతని పూర్తి పేరు వ్లదీమిర్ ఇవానిచ్ కరల్యోఫ్. అందులో మొదటిది అతని పేరు. రెండవది తండ్రి పేరు. మూడవది ఇంటిపేరు. ఒకపాటి పరిచయస్తులైతే అతని పేరును తండ్రి పేరుతో కలిపి పిలవాలి. బాగా పరిచయస్తులైతే మొదటి పేరును కుదించి వలోద్య అనీ, ముద్దు అయితే వోవ అనీ, ఇంకా ముద్దు అయితే వోవచ్కా అనీ పిలుస్తారు.

ఆ ఆహ్వానానికి రమాకాంతం ఎగిరి గంతేశాడు. చేస్తున్న లెక్కల దస్త్రం మూసేశాడు. వలోద్య వివరాలు కొద్దిగా చెప్పేడు. సాయంకాలం బస్సు మీద 'మిహాయిలవ్స్కి' అనే చోటికి వెళ్లి, అక్కడి నుంచి మరో నాలుగు మైళ్లు అడవిలోకి నడవాలి. అక్కడ రాత్రి ఉండాలి.

"అడవిలో చలేస్తుంది. భోజనం బాగుండదు. వాతావరణం ప్రస్తుతం బాగుంది. రేపు బాగుంటుందన్న రూఢిలేదు. సైయేనా?"

"ఇంకా అడుగుతున్నావూ? రెడీ!"

"అడవిలో రాత్రి పడక. రేపు సాయంకాలం తిరిగి వస్తాం. రానూపోనూ నడక పది మైళ్లేనా ఉంటుంది నడవగలవా?"

హిందూదేశస్తులు సుకుమారులనీ, కష్టమైన పనులేవీ చెయ్యలేరనీ అప్రథ ఒకటి రష్యాలో బాగా ఉంది. అందుకనే కష్టపడడాన్ని గురించి వలోద్య ఇంతగా నొక్కులు నొక్కుతున్నాడని గ్రహించి రమాకాంతం చిరునవ్వునవ్వేడు.

"ఇంతకీ వెడుతున్నది ఎంతమంది?"

"నువ్వూ నేనూ కాక మరో ఇద్దరు అమ్మాయిలు. సరిగ్గా సరిపోతాం"

సరిగ్గా సరిపోవడమంటే ఒక మగవాడికి **ఒక ఆడపిల్ల** చొప్పున ఉండడ మన్నమాట. ఆడవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా, మగవాళ్ల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఇబ్బందే అని అతని ఉద్దేశం. రమాకాంతం నవ్వుకున్నాడు.

"ఆ పిల్లలు ఎవరు? పేర్లు ఏమిటి?"

"అది అంతా వాళ్ల నడిగి నువ్వే తెలుసుకో. నన్నెందుకు అడుగుతావు? అందులో ఒక్క అమ్మాయినే నేను ఎరుగుదును రెండో పిల్ల ఎవరో నాకూ తెలియదు"

ఇల్లాంటి ప్రయాణాలకి అపరిచితులైతేనే మంచిదంటాడు వలోద్య. రమాకాంతం ఏరకం బట్టలు తొడుక్కోవాలో ఏమేవి కొనితేవాలో తెలియజెప్పేడు.

"సాయంకాలం నాలుగ్గంటలకి వస్తాను కలిసి వెడదాం. దగవరీలిస్? (సరేనా!"

"దగవరీలిస్స్" (సరే.)

వలోద్య బయటికి వెళ్ళిపోయాడు. రమాకాంతం కిటికీ తలుపు తెరిచాడు. పంతొమ్మిదో అంతస్తు నుంచి కిందికి చూస్తూ ఉంటే పండ బారుతున్న బిర్యోజ (భూర్జ?) వృక్షాల తోపు, దూరంలో లమనోసవ్ విగ్రహం కనబడుతున్నాయి. సైకిళ్ల మీద పోటీలుగా పోతున్న పిల్లలు, బుజాల మీద గుడారాల మూటలతో వంగి వంగి వెడుతున్న జనం, ఈ ఎండలో వాలీ బాల్ ఆడుతున్న పిల్లలు.... అంతా కోలా హలంగా ఉంది. ఎంత చక్కని సమయం లెక్కలతో వ్యర్థం అయిపోతోందీ ?

రమాకాంతం యూనివర్శిటీ హాస్టలులో భూమి అడుగున ఉన్న గ్రసినోవ్‌కి, వెళ్ళాడు. బిస్కట్లు, వెన్న, కల్బసా కొన్నాడు. కల్బసా అన్నది పందిమాంసంతో చేసిన ఒక వస్తువు. మాంసం ఉడకబెట్టి, మెత్తటి గుజ్జులా చేసి, రోకలి అంత లావున కడ్డీలుగా నొక్కి, సెలోఫిన్ పేపరుతో మూసి అమ్ముతారు. దానిని ఆపళంగా తినవచ్చు. ఇటువంటి ప్రయాణాలకి అది చాలా వీలు.

రమాకాంతం పుట్టినది పరమ ఛాందస వైదిక కుటుంబంలోనే అయినా స్వదేశంలో ఉండగానే ఇటువంటి తిళ్లకి అలవాటు పడ్డాడు. పైచదువుకి రష్యా వచ్చాక రష్యను లకు మల్లేనే ముప్పొద్దులా మాంసాహారమే.

సరిగ్గా నాలుగింటికి వలోద్య వచ్చాడు. అతని కోటుజేబులో నుంచి బయటికి కన్పిస్తున్న సీసా మూతను బట్టి అది "స్తొలీచ్న యూవోద్కా" (మన పరిభాషలో వోడ్కా) అని గ్రహించాడు రమాకాంతం.

యూనివర్శిటీ క్లబ్బు గేటు దగ్గరకు కుడివైపు గంటస్థంభం మీద టెంపరేచరు 16 డిగ్రీలు చూపిస్తోంది.

"మా బెజవాడలో అయితే నడి శీతా కాలంలో కూడా ఇంతకన్నా వేడిగా ఉం టుంది" అన్నాడు రమాకాంతం.

మాటపదకొండో నెంబరు బస్సు ఎక్కి, అక్టోబరు స్క్వేర్‌లో దిగేరు. ఆ స్క్వేర్‌ని కొద్దిరోజుల క్రిందటి వరకూ కలూజ్‌స్కీ స్క్వేర్ అనేవారు. అది ఒక విప్లవ వీరుడి పేరు. పేరు మార్చిన కారణం తెలియదు రమాకాంతానికి. ఆమాటకు వస్తే అసలు ఎవరికీ తెలియదు.

"కల్వాజ్‌స్కీ కన్న అక్టోబర్ గొప్పదని ఈమధ్యనే తెలిసింది కాబోలు, పేరు మార్చేరు."

వలోద్య ఏమీ మాట్లాడలేదు. ఒక్క క్షణం కను బొమ్మలు ముడిచేడు. తాను ఆమాట అనకుండా ఉండవలసింది అను కున్నాడు రమాకాంతం.

ఇక్కడి నుంచే పట్టణ బహిః ప్రాంతా లకు పోయే బస్సులు బయలుదేరుతాయి. చేరుకోవలసిన మిహాయిలవ్స్కి 48 కిలో మీటర్లు ఉంది.

"అదిగో వస్తున్నారు మనవాళ్లు!"

ఇద్దరు ఆడపిల్లలు చేతిలో పెద్ద సంచులతో, నీలిరంగు స్పోర్ట్సు దుస్తులతో కనిపించారు.

ఒకళ్ళనొకళ్ళు చూచుకున్నారు. ఆఇద్దరి



పిల్లల కళ్లల్లో రమాకాంతరావు మీదే ఉన్నాయి. ఆ కళ్లల్లో భారతదేశంలో అతనికి పరిచయమైన సిగ్గు సంకోచం లేవు. రమాకాంతంలో మాత్రం సిగ్గుపాలు ఇంకా పూర్తిగా పోలేదు. ఆ సిగ్గును గాంభీర్యం అనే ముసుగుతో దాచుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు.

''ఇదిగో ఇతడే రావు''

రమాకాంతరావును ఆ పిల్లలకు పరిచయం చేశాడు వలోద్య. అతడిని అక్కడ అంతా రావు అనే వ్యవహరిస్తారు. మూడు దీర్ఘాక్షరాలున్న అంత పెద్దపేరును రష్యనులు పలుకలేరు. అపసవ్యంగా ఉచ్చరితం కావడం ఇష్టంలేక తన పేరు రావు అనే చెప్పుకుంటాడు.

''జ్డ్రాస్త్‌విత్యే!'' అని పరస్పరాభివందనలు అయాయి.

ఆ ఇద్దరిలో వలోద్య స్నేహితురాలు తమార. ముఖం తీర్చిదిద్దినట్లుంది. రెండవ అమ్మాయి పేరు ఎకతరీన. అందరూ కాత్య అనీ, ముద్దు అయితే కత్యూష అనీ పిలుస్తారు. ఆమె సామాన్యంగా ఉంది. నెత్తి మీద కొప్పులా ముడిచింది. చదువుకున్న ముఖంలా కూడాలేదు. కాని, మేధమెటిక్సుతో యూనివర్సిటీ పూర్తి చేసిందని తరువాత తెలిసింది.

ఎక్కువ మాట్లాడుకోడానికి వ్యవధే లేకపోయింది. బస్సు కదిలిపోతూ ఉంటే నలుగురూ ఎగిరి ఎక్కేశారు. బస్సు నిండా ఒకటే జనం. ఒంటికాలి జపం అయిపోయింది. వలోద్య తమార ఒక చోటికి చేరేరు. రమాకాంతానికీ, కాత్యకీ మధ్య నలుగురైదుగురు నిలుచుని ఉన్నారు. బస్సు నడుస్తున్నంత సేపూ మాట్లాడడానికి లేకపోయింది.

బస్సు ఆగింది. నలుగురూ కిందికి దిగేరు. కాత్య చాలా హుషారుగా ఉంది. నవ్వులు, పాటలు, పొడుపు కథలు, హాస్యాలు, పరుగులు, అందుకోవడాలు— అన్నింటికీ, మొదలు కాత్య. తమార స్వయంగా మితభాషి. వలోద్య ఎందుకనో ఆరోజున చాలా తక్కువగా మాట్లాడేడు.

''రావు! నీకు మాదేశం నచ్చిందా?'' అంది కాత్య.

పరిచయమైన మరుక్షణం నుంచీ నువ్వు నువ్వు అనడం రష్యనులకు అలవాటు. నిజానికి నువ్వు అనేది చాలా చక్కని మాట. అది సాన్నిహిత్యానికి మారుపేరు. 'బాలే సుతానాం' ఉండనే ఉంది. తెలుగుదేశంలో బాల్య పరిచయాలు తప్ప మిగిలినవనీ, ఎంత కాలం నుంచి ఎంత సన్నిహితంగా ఉన్నా 'మీరు'గానే మిగిలిపోతాయి. ముందు ఎబ్బెట్టుగా ఉన్నా, రమాకాంతానికి ఈ పద్ధతి నచ్చింది.

''తినడం మొదలు పెడదామా?''

కాత్య సంచీలో చెయ్యిపెట్టి ఏదో వస్తువును బయటికి తీసింది. చూడడానికి చక్కిలంలా ఉంది. అందరికీ తలో కట ఇచ్చింది.

కుడీ ఎడమా బిర్యోజ, సస్నో, యేల్ దూబ్, తోపల్ వృక్షాల చిట్టడవి. మరీ అంత దట్టంగా ఏమీలేదు. ఆకులు అన్నీ పండిపోయి సగం పైగా రాలిపోయి ఉన్నాయి కొన్ని పొదలు చిక్కని ఎరుపు రంగులో కొన్ని పసుపు రంగులో, కొన్ని ఆకుపచ్చగ ఉన్నాయి.

అప్పుడూ అప్పుడూ ఎదురయే ఏవో ట్రక్కుల లైట్లు తప్ప అంతా చీకటిగ ఉంది. మనుష్య సంచారం ఏమీలేదు మెలికలు తిరుగుతూ పోతున్న సన్నని రోడ్డు మీది గతుకులలో నిలిచిన వర్షపు నీటితో గన్నవరం కాలువ గట్టులా ఉంది. ఇటు వంటి అడవిలో, చీకటిలో అపరిచితులైన మగవాళ్లతో కలిసి తిరగడానికి ఆ ఆడ పిల్లలకు భయంలేదు కాబోలు. పెళ్లికాని పిల్లలను అల్లా పంపడానికి వాళ్లవాళ్లకి అభ్యంతరం లేదు కాబోలు. ఈమాట రమాకాంతానికి నాలుక చివరిదాకా వచ్చింది కాని, అడగలేదు.

''ఈ అడవిలో ఏయే జంతువు లుంటాయో?''

''బాబోయ్! ఆ ప్రశ్న మాత్రం వెయ్యకు. నాకు అసలే భయం. అందులోనూ చీకటి'' అని భయం నటించింది కాత్య.



పెళ్లికొడుకు తను దిగిన ఫోటోల్లో కల్లా బాగావచ్చింది ఇదేనటమా! ... అందుకే ఇది ఇచ్చాడు!

"ఇద్దరు వీరాధివీరులం ఉండగా మీకు ఆపద రానిస్తామా?"

"స్పసీబ!" అన్నారు కాత్యా తమారాలు. ఆ మాటకు కృతజ్ఞులం అని అర్థం.

హరిద్వార్ దగ్గర అడవికి విక్రమ్ సింగ్‌తో కలిసి వేటకు వెళ్లిన రోజు జ్ఞాపకం వచ్చింది రమాకాంతానికి. పెద్దపులి అడుగులు ఎల్లా ఉంటాయో, వాటి ఆకారాన్ని బట్టి అది మగదో, ఆడదో ఎంత పొడుగు ఉంటుందో ఎల్లా తెలుసుకోవచ్చునో విక్రమ్‌సింగ్ దగ్గర నేర్చుకున్న విషయాలు వాళ్లకు వివరించాడు రమాకాంతం, అడవి జంతువుల గుట్టుమట్లు అన్నీ తనకు బాగా తెలుసు నన్నంత ధీమాతో. సంభాషణ యథాప్రకారంగా ఇండియాలోని పాములు, కోతులు, పెద్దపులుల చుట్టూ తిరిగింది. ఇండియాలో వీధులలో కూడా పెద్దపులులు తిరుగుతూ ఉంటాయనీ, ప్రతివాడూ ఒక ఏనుగును పెంచుకుంటూ ఉంటాడనీ రష్యన్ పిల్లలు అనుకుంటూ ఉంటారు.

నలుగురూ ఒకళ్ల చేతుల్లో ఒకళ్ల చేతులు దూర్చి, సన్నని రోడ్డు మీద ఇరుకు ఇరుగ్గా నడుస్తున్నారు. తమార సంచీలోంచి ఏపిల్ తీసింది.

"చాకు ఎక్కడ ఉందో కనిపించడంలేదు. ఒకరి తరువాత ఒకరు కొరుక్కుందాం" అని తాను ముందర కొరికి వలోద్య కిచ్చింది. అతడు కొరికి కాత్యకి ఇచ్చాడు. ఆతరువాత రమాకాంతం చేతికి వచ్చింది.

అసలు ఎంగిలీ అనేమాట రష్యను భాషలో లేదు. ఒక్క రష్యనులోనే కాదు మనదేశ భాషలలో తప్పించి మరేభాషలోనూ ఎంగిలీ అనేమాట లేదు. బ్రౌన్ తన నిఘంటువులో ఎంగిలికి ఇంగ్లీషు మాట దొరకక నాలుగైదు వాక్యాలలో దాని అర్థాన్ని వివరించాడు. ఎంగిలికి మనదేశంలో ఉన్న పట్టింపు మరెక్కడా ఉన్నట్లులేదు.

ఇతరుల ఎంగిలి తినడం రమాకాంతానికి ఇదే మొదటిసారి కాదు. డైనింగు హాలులో తింటూ తింటూ ఉన్న చెమ్చాతో బల్ల మీద మధ్యగా అందరి కోసం పెట్టిన ఉప్పు తీసుకోవడం అక్కడ బహు సామాన్యం. ఐస్‌కాండీ ఒక్కటి కొని నలుగురైదుగురు




పిల్లలూ వరసగా ఒకరి తరువాత ఒకరు తినడం మామూలే. రమాకాంతానికి ఈపని వెగటుగా అనిపించేది మొదటి రోజులలో. ఇది ఆరోగ్యానికి భంగకరంకాదా అనేవాడు. తోటి ఇండియన్ స్నేహితు డొకడు రమాకాంతం అనుమానాన్ని తీర్చేడు.

"రష్యన్ ఆడపిల్ల దొరికితే ముద్దు పెట్టుకోడానికి తయారేకాని వాళ్ళు కొరికిన ఏపిల్ మాత్రమేనా అభ్యంతరం?"

ఆ సమాధానం విని రమాకాంతం నివ్వెరపోయాడు. ఆలోచించగా అదీ నిజమే అనిపించింది.

కాత్య అందించిన ఏపిల్ తీసుకొని పెద్ద ముక్క కొరుక్కున్నాడు రమాకాంతం.

"అయ్యయ్యో! అంతా కొరికెయ్యకు. మాకు కూడా మిగుల్చు" అంది తమార.

మనవైపున చిన్నపిల్లలు కాకి ఎంగిలి చేసి, పమిష్టిగా తినడం అభివర్ణించాడు రమాకాంతం.

"చొక్కా కింద పెట్టి కొరకడం ఎందుకూ?"

కాత్యకి దాని ఉపయోగం ఏమిటో అర్థం కాలేదు. రమాకాంతం సమాధానం ఇవ్వలేదు.

## రజ్జుసర్పభ్రాంతి

"అదిగో ఎలుగుబంటి!" ఉన్నట్టుండి రమాకాంతం భయంగా అరిచేడు.

"మా అడవులలో ఎలుగుబంట్లు లేవులే"

"నేను అన్నది అడవిలో ఎలుగుబంటిని గురించి కాదు. అదిగో ఆకాశంలో"

రమాకాంతం సప్తర్షి మండలాన్ని చూపించాడు. దానిని పాశ్చాత్యులు పెద్ద ఎలుగుబంటి అంటారు.

"దొంగా!"

కత్యూష రమాకాంతం వేళ్ళు గట్టిగా నొక్కింది.

మూడు కిలోమీటర్లు నడిచేక కంకర రోడ్డు వదిలి, కుడివైపు తిరిగి, అడవిలోకి కాలిదారి పట్టేరు. దారి ఒక్క తమారకి తెలుసు. ఆమె స్నేహితు లెవరో అక్కడ ఉంటున్నారుట. రాత్రి ఆరుబయట చలి అనిపిస్తే వాళ్ళఇంట్లో పడుక్కోవాలని నిర్ణయం. ఆ ధీమాతోనే ఆలస్యంగా బయలుదేరేరు.

దారి అంతా తడితడిగా జారుడుగా ఉంది. ఏవేవో కొమ్మలు ముఖాలకు తగులుతున్నాయి. పాములు ఉండవని తెలియడం చేత భయం లేదు. 'ఇక్కడ రవుడీలు ఆడపిల్లలను ఎత్తుకుపోయి అల్లరి చేయడం లేదు కాబోలు' అనుకున్నాడు రమాకాంతం.

తమార జర్రున జారిపడపోయింది. ఆమెను లేవదీయబోయి రమాకాంతం కూడా పడ్డాడు. సాధారణంగా ఇటువంటి ప్రయాణాలకు మంచిబట్టలు ఎవరూ వేసుకోరు. అటువంటి ప్రత్యేకమైన దుస్తులు లేని రమాకాంతం ఒక్కడే తాను మామూలుగా వేసుకునే సూటు వేసుకున్నాడు.

కత్యూష పకపకా నవ్వింది. చెయ్యి అందించి లేవదీసింది.

"జారి పడతాను బాబోయ్!" అని భయం నటించి, కాత్య జబ్బలు గట్టిగా పట్టుకుని నడువసాగేడు రమాకాంతం.

చీకట్లో దారి తప్పి, మరో మూడు కిలో మీటర్లు అధికంగా నడిచి, రాత్రి తొమ్మిదింటికి ఆఇంటికి చేరుకున్నారు. అది సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి సంబంధించిన ఇల్లు. తమార చనువుగా లోపలికి వెళ్ళి, పక్కగది తలుపు తెరిచింది. లోపల ఎలక్ట్రిసిటీ కూడా ఉంది. జెనరేటర్‌కి బలం చాలక కాబోలు లైటు వెలుగు హెచ్చుతూ తగ్గుతూ ఉంది.


తెచ్చిన సామాను కిందికి దింపి ఒళ్ళు విరుచుకున్నారు. ఆడపిల్లలు భోజన ప్రయత్నాలు చేశారు. కల్బసా పలుచగా రేకుల్లా కోసి, రెండు బ్రెడ్ ముక్కల మధ్యని పెట్టి, అందరికీ అందించారు. వోడ్కా సీసా మూత తీసి అందరికీ అందించాడు వలోద్య. రమాకాంతరావు తనకు వద్దన్నాడు.

"రావ్! మీదేశంలో వోడ్కా దొరుకుతుందా?"

"వోడ్కా కాకపోతే అంత ఘాటైన మరో రకం ఏవో దొరుకుతాయి."

"మీదేశంలో ఎవరూ తాగరట కాదూ? నిషేధం ఉందిట నిజమేనా?"

"తాగ కూడదని రూలు ఉంది కాని కొందరు తాగుతూనే ఉంటారు. ఇదివరకు అటువంటి నిషేధం ఉండేదికాదు. నిషిద్ధం కాదు కదా అని అందరూ తాగేవారూకాదు. తాగడం పంచమహా పాతకాలలోనూ ఒకటి అంటూంది మా మతం. నేను తాగకపోవడా



నికి మతం మీది భక్తికాదు కారణం."

"మరి?"

"డాక్టరు వద్దన్నాడు"

"ఓస్. డాక్టరు నన్నూ వద్దన్నాడు. వాళ్ళని అడిగితే మరోలా ఎందుకంటారు?"

భోజనం అయాక నలుగురూ బయలు దేరేరు. లక్ష్యం ఏమీలేదు. ఎటు తోస్తే అటు. దూరంగా కుక్కలు మొరుగుతు న్నాయి. దూరాన లోయలో మంచు తెర కప్పి సముద్రమేమో ! అన్నట్లు ఉంది. వలోద్య, తమార జట్టాపట్టాలు వేసుకుని, అనుకుని నడుస్తున్నారు.

ఉన్నట్లుండి వెనుక పాటుగా వచ్చి ఎవరో రమాకాంతాన్ని ఒక్క తోపు తోశారు.. ఉలిక్కిపడి వెనుదిరిగి చూశాడు. పకపకా నవ్వుతూ కాత్య పరుగెడుతోంది. రమా కాంతం ఆమెను ఒక్క పరుగులో అందు కుని, పారిపోతున్న ఆమె జడ పట్టుకున్నాడు. రష్యాలో ఆడపిల్లలకు జడ ఉండడం పాత ఫాషను.

"నీ జడ చాలా బాగుంది" అన్నాడు తెలుగు సినిమాలో హీరో వర్ణించే స్టైలా గులా.

"నిజంగానా? మా జట్టు పిల్లలంతా జడలు కత్తిరించేసుకున్నారు! నేను తప్ప"

"కొప్పు పెడతావు దేనికీ? ఇల్లా పొడుగ్గా వదిలేస్తే ఎంత మజాగా ఉంటుందో ! మా దేశంలో ఆడపిల్లలు జడ చివర జడ గంటలు అని కట్టుకుంటారు. వాళ్ళు నడు స్తూఉంటే జడగంటలు తకధై తకధై అని అట్నూ, ఇటూ ఆడుతూ ఉంటే చాలా బాగుంటుంది. ఉండు నీకు జడ గంటలు కడతా"

రమాకాంతం ఉమ్మెత్తకాయలు కోసి ఆమె జడ చివర కట్టేడు.

"రావ్! మీ దేశంలో అమ్మాయి ఎవ రైనా ఉందా ?"—నెమ్మదిగా అడిగింది చెవిలో.

"మా దేశంలో ఒక్క అమ్మాయి ఏం ఖర్మం? మాటికి 51 మంది అమ్మాయిలే"

"నేను అడిగింది అదికాదు. నీకు ప్రదూగ ఉందా అని."

'ప్రదూగ' అంటే స్నేహితురాలు అని నిఘంటువర్థం. కాని, వాడుకలో పెళ్ళిచేసుకో బోయే పిల్ల అని అర్థం ఆ రెండో అర్థం తనకు తెలియనట్లు నటించాడు రమాకాంతం.

"నాకు స్నేహితురాళ్లు చాలామందే ఉన్నారు. అందులో ఒక్క పిల్లను విడదీసి ఇదిగో ఈ అమ్మాయే నా స్నేహితురాలు, మిగిలినవాళ్లు కాదని చెప్పడం ఎల్లాగ? ఇతరులకు కోపం రాదా?"

"నీకు తెలియనట్లు నటిస్తున్నావ్. నీకు రష్యన్ ఇంత బాగా వచ్చునుకదా. ఈ మాటకి అర్థం తెలియదంటే నేను నమ్ముతానా? అన్నట్లు నువ్వు ఈ దేశం రాకమునుపే మా భాష నేర్చుకున్నావా ?"

"లేదు. 'ఆబేవేగే'ల దగ్గరనుంచి ఇక్కడే. అంతకు ముందు ఒక్క మాట కూడా రాదు." ఆ మాటను అతడు చాలా గర్వంగా చెప్పుకుంటాడు. "రష్యన్ ఇంత బాగా మాట్లాడుతున్నావు. ఎన్ని ఏళ్లనుంచి ఇక్కడ ఉంటున్నావు?" అని ఎవరో ఒకరు అతన్ని అడుగుతూనే ఉంటారు.

"అబ్బే! ఏళ్లు ఎక్కడ! పది నెలలు అయింది వచ్చి" అంటాడు సాగివేస్తు న్నట్లు.

"నువ్వు అడిగిన అర్థంలో నాకు ప్రదూగ ఎవ్వరూలేరు ఇంతవరకూ" అన్నాడు కత్యూష కళ్లలోకిచూస్తూ. మొదట్లో చూచినప్పటికన్న ఇప్పుడు ఆమె అందంగా కనిపిస్తోంది. ఆరోగ్యమైన పౌష్టవమైన శరీరం. ఆమె బుగ్గలు రెండు అర చేతుల లోనూ పట్టుకున్నాడు.

"అరే. వాళ్లు ఏరీ? చాలా దూరం పోయినట్లున్నారు. పద వెతుకుదాం" అని అప్పుడే జ్ఞాపకం వచ్చినట్లు రమాకాంతం చెయ్యి పట్టుకుని ఎదరకు తీసుకుపోయింది.

"తమారా! హోవా!" అని షడ్జ మంలో కేకవేసింది. వాళ్ళు దగ్గరలోనే కనిపించారు

"చలిమంట వేసుకుందాం రండర్రా !" ఉత్సాహం అంతా కాత్యదే.

పొడిగాఉన్న పుల్లలు కొద్దిగా దొరి కేయి. కదిలిపోతున్న మంట వెలుగులో కత్యూషముఖం వింత సోయగాలు పోయింది.

"రావుకి నువ్వు బాగా నచ్చేవు" అన్నాడు వలోద్య.

"నిజంగానా? స్పసీబ!" అంది కాత్య.

రమాకాంతం నవ్వి వూరుకున్నాడు.

చలిమంట ఆరిపోయింది. ఒంటిగంట కావస్తోంది. అందరికీ ఆవలింతలు వస్తు


ఫోన్.243
No.638.
శారదా (REGD)
ఆభరణములు
బంగారు కవరింగ్ చేయబడిన
5 సం॥ గ్యారంటీ
No. 780
శారదా గోల్డ్ కవరింగ్ వర్క్స్
మచిలీపట్నం

పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

గొంతుగ నొప్పి?

పెప్స్
శీఘ్రముగా నివారణ నిచ్చును!


పెప్స్ బిళ్లలు గొంతుగ నొప్పి, జలుబులు, మరియు బ్రాంకైటిస్‌ను... శీఘ్రముగా శమనము పరచి నివారణ చేయును. ఇవి పిల్లలకు కూడ సురక్షితమైనవి.
అన్ని జనరల్ స్టోర్సు మరియు కెమిస్టులవద్ద దొరుకును.
SHBI-FP-7 TEL.

మద్రాసు స్టేట్‌కు డిస్ట్రిబ్యూటర్లు:
మెః వెరాతి & కంపెనీ, 214, గోవిందప్పనాయక్ వీధి, పి. బి. నెం. 1902, మద్రాస్—1.

30 సం॥ లుగా
ప్రసిద్ధి చెందినది




ఫ్రూటాల్ ★ ఫ్రూటాల్

అన్నివేళలా సేవించదగిన
ఉత్తమ పానీయం.

రాత్రులందు చదవండి
2 పుస్తకముల సెట్టు రు 2-50
కొక్కోకశాస్త్రము 84 ఆసనములు
(చిత్ర పటములతో) సుహాగ్ రాత్
ఒక్కొక్క పుస్తకం రు. 1—50
పోస్టేజి ప్యాకింగు అదనం.
ARAHANT BOOK DEPOT.,
26, ALIGARH (U .P.)

నేషనల్ ట్రాన్సిస్టర్
జపానుచే కనుగొనబడిన జేబు రేడియో. పెద్ద రేడియోలాగ పలుకుతుంది. అన్ని ట్రాన్సిస్టర్లు, లౌడ్ స్పీకర్లు గ్యారంటీ, జపాను తయారీ. ప్రి



ష్కృప్రకారం ఎక్కడవైనా సంగీతం, వార్తలు వగైరా విన వచ్చు. ప్రపంచమందలి ప్రతి స్టేషను స్థానికంగా వినబడు నట్లు గ్యారంటీ. వినటానికి సిద్ధంగ ఏ. పబడును. టార్చి సెల్స్‌తో పనిచేయును. అమవైనది, అందమైనది, తేలికైనది. 3 సం॥ గ్యారంటీ. డీలక్స్‌నెం. TR 45 ధరరు 68/-వి.పి.పి. ఛార్జిలు రు. 6/- రేడియో లెదర్ కేసు రు. 7/-
INDOJAP ARTS (WAT-68)
Beat No. 13, Aligarh.

# రజ్జుసర్ప భ్రాంతి

న్నాయి. "పోయి పడుక్కుందాం రండి!" అంది తమార.

గదిలో రెండు మంచాలు, వాటిమీద చెరో దుప్పటీ పరిచి ఉన్నాయి.

కాశీ మజిలీ కథలలో కత్తి మధ్యలో పెట్టుకుని ఒపక్కమీద రాజకుమా రుడు, రాజకుమార్తె పడుక్కోవడం జ్ఞాపకం వచ్చింది రమాకాంతానికి. ఆడపిల్లల నిద్ద రినీ మంచాలమీద పడుక్కోమని తామిద్దరూ కింద పడుకుంటాం అని చెప్దామను కున్నాడు.

అంతలో "స్పకోయ్ నయానోచ్! (గుడ్ నైట్)" అని ఆడపిల్ల లిద్దరూ లోపల మరోగదిలోకి వెళ్లిపోయారు.

తనకు కలిగిన ఆలోచనలకి రమా కాంతం నవ్వుకున్నాడు.

గదిలో చలిగా ఉంది. పగిలిన గాజు తలుపులోంచి రివ్వున గాలి వీస్తోంది. దుప్పటీ ముసుగుపెట్టి వలోద్య అప్పుడే గుర్రు పెడుతున్నాడు. రమాకాంతానికి అంతా కలతనిద్ర. తెల్లవారుజామున కోళ్లు కూశాయి. కోడికూత విని ఎంత కాలమైందా అనుకుంటూ కళ్లు విప్పేడు.

రమాకాంతంలేచి బయటికి వచ్చాడు. బయట అంతా పొగమంచు. నేల అంతా చెమ్మగా ఉంది. నిన్నరాత్రి చీకట్లో కన బడనివన్నీ ఇప్పుడు కనబడుతున్నాయి. ఆ ఇల్లు కర్రలతో కట్టి ఉంది. రష్యాలో పూర్వకాలపు ఇళ్లు అన్నీ ఇల్లాగే ఉంటాయి. **ఇంటి చుట్టూ కోళ్లు, ఆవులు, కుందే** ళ్లూనూ. పల్లెటూరి వాతావరణాన్ని భంగ పరుస్తూ ఆ ఇంటి నడికొప్పున టెలివిజన్ ఏరియల్.

**కొంకరించుకుపోయే** నీళ్లతోనే రమా కాంతం ముఖం కడుక్కున్నాడు. వలోద్య దంత ధావన పరికరాలేవీ తెచ్చుకోలేదు. ఏ చెట్టు కొమ్మనో విరిచి తోముకుంటా డేమో. అబ్బే! అటువంటిది వాళ్లు ఎర గరు.

"ఒక్కరోజు పళ్లు తోమకపోతే ఏమీ మునిగిపోదులే" అన్నాడు వలోద్య.

అంతలో ఎక్కడినుంచో బ్రష్షు తీసుకు వచ్చి తోమసాగేడు. అది తమారాదిట! రమా కాంతం ఆశ్చర్యపడ్డాడు. ఒకరు కొరికిన కాయ మరొకరు కొరకడానికీ, ఒకరి బ్రష్షు మరొకరు వాడడానికీ పోలికలేదు. అతనికి మాత్రం ఆ పట్టింపులులేవు. ఆ పిల్లకీ లేవు కాబోలు.

నాస్తా పూర్తిచేసి నలుగురూ అడవికి బడుపడి నడువసాగేరు. వో దారీ తెన్నూ లేదు. ఎటుతోస్తే అటు. చుట్టూ అడవి అంతా బంగారు రంగులో ఉంది. ఒక్క నెల్లాళ్లు ముందుగావస్తే ఇంకా బాగుండేది.

కుక్క గొడుగుల సీజను అయిపోయింది. రమాకాంతం తంటాలుపడి కుక్క గొడు గులు చాలానే ఏరుకు వచ్చాడు కానీ, అవి అన్నీ విషపు కుక్క గొడుగులట. వాటిని తినకూడదట. కాడ సన్నంగా గొడుగు పలుచగా పెద్దదిగా ఉంటే అది మంచిది కాదు. కాడ లావుగానూ, గొడుగు బలంగా చిన్నదిగా ఉండాలి. ఇంకా ఏవేవో భేదాలు చెప్పేరుకాని రమాకాంతానికి అర్థం కాలేదు.

ఒకచోట గడ్డి మేటిమీదపడి దొర్లేరు. చెరువులో చేపలు పట్టేరు. తమార, వలోద్య ఫోటోలు తీశారు. కాత్య రక రకాల పిచ్చి పువ్వులు కోసింది. ఏవో చెట్టు కాయలు. బొగడకాయలలా ఉన్నాయి. వాటికి నెత్తిమీద టోపీలాఉంది. వాటిని సందులు తింటాయిట. వాటిని దండగుచ్చి మెడలో వేసుకుంది.

ఒకచోట పెద్ద చీమలపుట్ట. ఆ చీమల శరీరం సగం ఎరుపూ, సగం నలుపూనూ. అవి మన ప్రాంతపు దుగ్గాని చీమలలా ఉన్నాయి.

"రావ్! చీమల ఏసిడ్ రుచిచూస్తావా?" అంది కాత్య. ఒక గడ్డి పరకను ఆ చీమల గుంపుమీద దొర్లించింది. చీమలు ఆగడ్డి **పరకను** తెగకుట్టేయి. చీమలను విదిలిం చేసి ఆ గడ్డిపరకను నాకమని రమాకాంతానికి ఇచ్చింది. అది పుల్లగా బాగుంది.

పేక బయటికితీసి రమాకాంతంవాళ్లకు గాడిద ఆట నేర్పేడు.

సాయంకాలం ప్రయాణ సన్నాహంలో ఉన్నారు అంతా. చాలాహాయిగా, చాలా సంతోషంగా గడిపేను అనుకున్నాడు రమా కాంతం. అన్నట్లు కత్యూష్యను గురించిగాని, తమారను గురించిగాని తాను ఏమీ తెలుసు కోనేలేదు. వారి అడ్రసులు తీసుకుని అప్పుడప్పుడు కలుసుకుంటూ ఉండాలి అనుకున్నాడు. టెలిఫోను నెంబర్లు, అడ్ర స్సులూ వ్రాసి ఇమ్మన్నాడు.

"ఎందుకూ?" అంది తమార.

"ఎందుకేమిటి? నా స్నేహితులు ఏం చేస్తున్నారో అప్పుడప్పుడు తెలుసుకోడానికి"

"తెలుసుకోవాలని ఉంటే నా ద్వారా తెలుసుకోవచ్చునులే" అన్నాడు వలోద్య.

"ఏమి జెలసీ అయ్యా!" ముదలకించింది కాత్య.

ఆ పిల్లలిద్దరూ కాగితాలమీద అడ్రసులు వ్రాసి ఇచ్చారు.

ఆడపిల్లలు మగవాడి ఎడ్రసు ఇమ్మని అడగడం మర్యాదకాదు! అందుకనే వాళ్లు అడగలేదు. ఆ పిల్లలు అతని స్వంత విషయా లేవీ అడగలేదు ఇంతవరకూ.

సామానులు పుచ్చుకుని మరో చుట్టు దారివెంట బయలుదేరారు. దారిలో క్లోవ్యన్ అనే చెట్టువి పండబారిన ఆకులు కోసింది కాత్య. అవి లతలా అందంగా ఉంటాయి. వాటిని ఇంట్లో అలంకరిస్తారు.

ఆడపిల్లలిద్దరూ ఒకచోట ఆగేరు. వలోద్య రమాకాంతం దగ్గరకు వచ్చాడు. గొంతు తగ్గించి, "ఇందాకా వాళ్ళ ఎడ్రస్సులు రాసి ఇచ్చిన కాగితాలు ఇల్లా ఇయ్యి. ఏం రాశారో చూస్తాను" అన్నాడు.

రమాకాంతం ఆశ్చర్యపడ్డాడు.

"తరవాత ఇంటి దగ్గర చూద్దువు గానిలే"

"కాదు. పని ఉంది. ఇప్పుడు చూపించు"

వలోద్య ముఖం చాలా సీరియస్‌గా ఉంది. మూడవ ప్రపంచయుద్ధం వచ్చి పడుతుందేమో అన్నంత భయపడుతున్నట్టుగా ఉంది. అది అసూయవల్లనా!. నాగరికులు ఎవ్వరూ అంత బాహాటంగా అసూయని చూపించరు. ఇష్టంలేకపోయినా జేబులో ఉన్న కాగితపు మడతల్ని వలోద్యకి అందించాడు రమాకాంతం.

ఆ కాగితాలు చదివి, జాగ్రత్తగా చింపి, అవతల పారేశాడు వలోద్య.


"వాళ్ల ఎడ్రస్సులు నువ్వు తెలుసుకోకూడదు. ఆఖరికి వాళ్ల ఇంటి పేర్లు కూడా నీకు తెలియకూడదు. మనం ఇక్కడ గడిపినట్లుగా మరిచిపోవాలి. వాళ్లు పొరపాటున నీకు ఎడ్రస్సులు ఇచ్చారు. చాలా తప్పు అయిపోయింది. అది తప్పు అని నేనే వాళ్లకు చెప్పేను. వాళ్లు కూడా ఒప్పుకుని ఆ కాగితాలు తిరిగి తీసుకోమన్నారు. వాళ్లు డిఫెన్సుశాఖలో పని చేస్తున్నారు. విదేశీయుడితో స్నేహం ఉన్నట్లు తెలిస్తే వాళ్ల ఉద్యోగాలు పోతాయి. జైల్లో కూడా పడేస్తారు......"

రమాకాంతం కోపంతో వణికి పోతున్నాడు. అందులో ఒక్క అక్షరం కూడా అతడు నమ్మదలుచుకోలేదు. అదంతా పెద్ద అభూత కల్పన. ఇల్లాగని వాళ్లని భయపెట్టి ఉంటాడు. వాళ్లు నమ్మి ఉంటారు. వలోద్య చెప్పినది ఎంతవరకూ నిజమో ఆ పిల్లలకు తెలియదు. ఏదో ప్రమాదం ఉందంటున్నాడు. ఎందుకు వచ్చిన గొడవ? ఇల్లాచేస్తే ఏ బాధాలేదు. ఇదీ ధోరణి. వలోద్య ఇంకా విద్యార్థి. వాళ్లు ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు. ఏది ప్రమాదమో ఏది కాదో ఆ పిల్లలకన్నా వలోద్యకి ఎక్కువ తెలుసునా? పైగా ఆ పిల్లలు పని చేస్తున్నామని చెప్పిన చోట్లు డిఫెన్సుకి సంబంధించినవన్న జ్ఞాపకంలేదు. ఒకవేళ సంబంధించినా విదేశీయుడితో పరిచయాన్ని నిషేధిస్తాయా! వలోద్యని చూచి జాలిపడాలో, అసహ్యించుకోవాలో రమాకాంతానికి అర్థంకాలేదు.

దారిలో ఎవ్వరూ మాట్లాడలేదు. అందరి మనస్సుల్లోనూ ఇదే తిరుగుతోంది. ఏమీ జరగనట్లే ఉండడానికి రమాకాంతం ప్రయత్నించాడు. బస్సులో కాత్య అతనిపక్కన కూర్చుంది ఆమె ఏవేవోవిషయాలను గురించి మాట్లాడుతోంది. రమాకాంతంఊఁ ఆ అని తప్ప మరేమీ అనడంలేదు. ఒక స్నేహితుడి మనస్సు గాయపడిందనీ, దానికి ఒక విధంగా తానే కారణమేమో అనీ ఆమె బాధపడుతున్నట్లుంది. ఆఖరికి రమాకాంతం చెవిలో చెప్పింది.

"రావ్! ఇల్లా జరుగుతుందని అనుకోలేదు. ఇందులో నా పాత్ర ఏమీలేదు."

రమాకాంతం ఏమీ మాట్లాడలేదు. ఒక మహా సంస్థ భయంమీద బ్రతుకుతోంది. అందులో వూహించుకున్న భయం ఎంతో నిజమైన దెంతో తెలియదు. తెలుసుకోడానికి భయం.




హోస్టలుకి తిరిగివచ్చాక రమాకాంతం వలోద్యని తన గదికి పిలిచాడు. ఒక కప్పు కాఫీ ఇచ్చి, తన అనుమానాలన్నీ బయట పెట్టేడు.

"మా దేశ పరిస్థితి నీకు తెలియదు. ఏది ప్రమాదమో నేను ఎరుగుదును. మీ దేశంలోమాత్రం దేశరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోరా?" అన్నాడు వలోద్య.

"దేశంమీద నీ కింతటి ప్రేమఉండడం మెచ్చుకోతగ్గదే. వాళ్లకి నాతోడి పరిచయమే అపాయకరమని తెలిసినప్పుడు అసలు నన్ను ఎందుకు తీసుకు వెళ్లేవు? పోనీ ఆ విషయం నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు....! ఆ కాగితంలో ఏంరాశారో చూస్తానని అబద్ధంచెప్పి తీసుకోవలసిన పని ఏముందీ? అల్లా చెప్పకపోతే ఇవ్వనని అపనమ్మకమా?—వాళ్లు ఉద్యోగం చేస్తున్నామన్న చోట్లు నువ్వు అన్నట్లుగా డిఫెన్సు మినిస్ట్రీలోకాదే......"

"వాళ్లు నీకు అబద్ధం చెప్పి ఉంటారు ఏదో ఒకటి చెప్పకపోతే బాగుండదని. అసలు వాళ్లు రాసిచ్చిన ఎడ్రస్సులూ అబద్ధమేనేమో" అన్నాడు వలోద్య.

హాతోస్మి. ఇలా వీళ్లని జయించినవాడ లేడు.

"ఆ రాసిన ఎడ్రసులు నిజమైనవి కాకపోతే నువ్వు తీసుకుని చింపెయ్యవలసిన పని ఏమిటి? ఇంతకీ వాళ్లపేర్లు తమార కాత్య అన్నవి నిజమేనా? లేక అదీ కల్పనేనా? అసలు ఈ జరిగినదంతా కలా నిజమా?..'

ఆమాటకు వలోద్య నవ్వేడు.

ఇంతకీ నిజమైన కారణం ఏమిటో రమాకాంతానికి అర్థంకాలేదు. ముందర అసూయతో ప్రారంభమై, అది కప్పిపుచ్చడాని డిఫెన్సు సంగతి ఎత్తి, అది తేలిపోతున్నట్లు కనబడగానే అబద్ధం మీద అబద్ధం ఆడేడా

"ఆ తీసిన ఫోటోలు తగులబెట్టి వెయమనీ సలహా ఇచ్చాను. నీకు మా దేశ పస్థితులు అర్థం కావు" అన్నాడు వలోద్య

అయితే అపాయం అన్నది నిజమేనా అది వట్టినే కల్పించినదే అయితే ఇంత పడ్బందీగా ఆలోచించగలడా?

రమాకాంతం మనస్సు గజిబిజి అయిపోయింది. రెండు చేతులలోనూ కణతల పట్టుకుని కూర్చుండిపోయాడు.